31-07-2025
గురువారం
మల్కాజిగిరి

jayabherinews

ప్రభాత JAYABHERIDAILY.COM తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 68 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి



## నింగిలోకి దూసుకెళ్లిన నిసార్ ఉపగ్రహం

✍ జయభేరి, శ్రీహరికోట, జూలై 30:

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ సంయుక్తంగా అభివృద్ధి చేసిన భూపరిశీలనా ఉపగ్రహం 'నిసార్ సక్సెస్‌ఫుల్‌గా అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. మొత్తం 2,392 కిలోల బరువున్న ఈ ఉపగ్రహాన్ని భారత్‌కు చెందిన GSLVF16 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి మోసుకెళ్లింది. జీఎస్ఎల్‌వీ రాకెట్ నిసార్ ఉపగ్రహాన్ని 740 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య అనువర్తిత కక్ష్యలోకి చేర్చింది. బుధవారం సాయంత్రం సరిగ్గా 5:40 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. దీనితో నిసార్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఈ ప్రయోగం కోసం ఇస్రో, నాసా కలిసి మొత్తం 1.5 బిలియన్ డాలర్లను ఖర్చు చేశాయి. ఈ ప్రతిష్ఠాత్మక మిషన్ ద్వారా భూమి ఉపరితలాన్ని పరిశీలించే విధానంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

...మిగతాది 2 లో



# ఆగస్టు 4న నల్గొండలో స్కూల్ భూమి పూజ

- అదే రోజు మినిస్టర్ క్యాంప్ ఆఫీస్ ప్రారంభోత్సవం
- రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది
- నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయండి
- నల్గొండకు YIIRS మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

✍ జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు సంబంధిత అధికారులు,కన్సల్టెన్సీ తో మంత్రుల నివాస సముదాయంలోని తన క్యాంపు కార్యాలయంలో నల్గొండ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమి పూజ, మినిస్టర్ క్యాంప్ కార్యాలయం ప్రారంభోత్సవం పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 4న ఉదయం నల్గొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమి పూజ ఉంటుందని,అదే రోజు ఇటీవల నూతనంగా నిర్మించిన మినిస్టర్ క్యాంప్ ఆఫీస్ ప్రారంభోత్సవం కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా నల్గొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నమూనాలను మంత్రి పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. 22 ఎకరాల్లో 5,36,194 స్కేర్ ఫీట్ల విస్తీర్ణంలో సుమారు 200 కోట్ల అంచనాతో అధునాతన హంగులతో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేయనున్నామని మంత్రి వెల్లడించారు. అకాడమీ బిల్డింగ్స్,స్టాఫ్ బిల్డింగ్స్, ప్లే గ్రౌండ్, యేటర్,విద్యార్థులకు స్కిల్ డెవల్మపెంట్ లాంటి బ్లాకులు ప్రత్యేకంగా ఉండనున్నాయన్నారు. భూమి పూజ అయిన తర్వాత ఎక్కడ రాజీ పడకుండా..నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ 18నెలల నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తి చేసేలా

...మిగతాది 2 లో



## బీఆర్ఎస్ ఉద్యమ బాట

✍ జయభేరి, హైదరాబాద్, జూలై 30 :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించనున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లో అడ్డుకుని తీరతామని తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. రాష్ట్ర రైతుల సంక్షేమం కోసం, వ్యవసాయ సంక్షోభాన్ని నివారించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ నేతలకు పార్టీ అధినేత కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

...మిగతాది 2 లో

## సింగపూర్ పర్యటన సూపర్ సక్సెస్

✍ జయభేరి, సింగపూర్, జూలై 30 :




పెట్టుబడులను ఆకర్షించటం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన సింగపూర్ పర్యటన విజయవంతంగా పూర్తయ్యింది. మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టీజీ భరత్ సహా ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి సింగపూర్ లో నాలుగు రోజుల పాటు అవిశ్రాంతంగా వివిధ సమావేశాలు, రౌండ్ టేబుల్ చర్చల్లో పాల్గొన్నారు. సింగపూర్ లోని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను సందర్శించి వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా అధ్యయనం చేశారు. పర్యటనలో మొత్తం 26 కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, మంత్రులు హాజరయ్యారు. పర్యటన మొదటి నుంచి చివరి రోజు వరకూ క్షణం తీరిక లేకుండా ఆసాంతం రాష్ట్ర అభివృద్ధి కాంక్షతో

...మిగతాది 2 లో



## రేవంత్.. కళ్లు తెరువు

✍ జయభేరి, హైదరాబాద్ :

సమస్యలు పరిష్కరించాలంటూ అలంపూర్ గురుకుల విద్యార్థులు చేస్తున్న పాదయాత్ర పై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసం పాదయాత్ర చేయడం కాదు, గురుకుల పిల్లల పాదయాత్రపై దృష్టి సారించాలని కాంగ్రెస్ కు చురక అంటించారు. దిగజారుతున్న గురుకుల వ్యవస్థను

...మిగతాది 2 లో



## విడాకుల వలన విలువలు తగ్గించుకుంటున్నారు

- ఓపిక,అడ్జెస్ట్‌మెంట్ వల్లనే బంధాలు నిలబడతాయి
- యాంకర్, నటి, అందాల ముద్దుగుమ్మ అనసూయ

✍ జయభేరి, హైదరాబాద్, జూలై 30 :

ఓపిక,అడ్జెస్ట్‌మెంట్ వల్లనే బంధాలు నిలబడతాయి. ఈ జనరేషన్ వారికి అంత ఓపిక లేదని అందాల ముద్దుగుమ్మ అనసూయ పేర్కొంది. అయితే ఈ మధ్య విడాకుల వలన విలువలు తగ్గించుకుంటున్నారన్నారు. ఇక మన అన్నతో మనకి విడాకులు ఉండవు. అమ్మతో విడాకులు ఉండవు.. అక్కతో ఉండవు. కానీ కేవలం భార్యతోనే ఉంటుంది. పెళ్లి అనే దానికి మన భారతీయ సాంప్రదాయంలో ఇచ్చేటంత గౌరవం మరెక్కడ కూడా ఇవ్వరన్నారు.యాంకర్‌గా, నటిగా అశేష ప్రేక్షకాదరణ దక్కించుకుంది. ఇక సోషల్ మీడియాలో చాలా

...మిగతాది 2 లో

## కోర్టు గది సరిపోదు.. క్రికెట్ స్టేడియం కావాలేమో..!

- సెంథిల్ బాలాజీ కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు..!

✍ జయభేరి, న్యూ డిల్లీ జూలై 30 :



మాజీ మంత్రి వీ సెంథిల్ బాలాజీ ప్రమేయం ఉన్న ఉద్యోగ కుంభకోణం విషయం లో తమిళనాడు ప్రభుత్వం తీరుపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. సెంథిల్ బాలాజీ ప్రమేయం ఉన్న ఉద్యోగ కుంభకోణంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి మాజీ మంత్రి డబ్బులు తీసుకున్నట్లుగా అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మల్య బాగ్చి ధర్మాసనం తమిళనాడు సర్కారుపై మండిపడింది. ప్రభుత్వం కావాలనే విచారణను ఆలస్యం చేస్తున్నట్లుగా కనిపిస్తోందని మండిపడింది. ప్రభుత్వం కేసును మూసివేసేందుకు ప్రయత్నిస్తే.. న్యాయశాఖ అడ్డుకుందంటూ మందలించింది.ఈ కేసులో 2000 మంది నిందితులు, 500 మంది సాక్షులుగా ఉన్నారన్న ధర్మాసనం.. భారత్‌లో అత్యధిక మంది విచారణలో పాల్గొన్న కేసు ఇదే అవుతుందేమోనని వ్యాఖ్యానించింది. నిందితులందరికీ కోర్టు గది సరిపోదని.. ఓ క్రికెట్ స్టేడియం కావాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని సర్వోన్నత న్యాయస్థానం తమిళనాడు సర్కారును ఆదేశించింది. బాలాజీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ విచారణకు హాజరయ్యారు. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి లంచం తీసుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీలో చేరి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రవాణాశాఖ కేసులో ఆయనను ఈడీ 2023లో అరెస్టు చేసింది.దాదాపు ఏడాదికి పైగా ఆయన జైలులో ఉన్నారు. బెయిల్‌పై వచ్చాక ఆయనకు స్టాలిన్ ప్రభుత్వం ఆయనను మంత్రిగా బాధ్యతలు అప్పగించింది.

...మిగతాది 2 లో



## ఈడీ విచారణకు ప్రకాష్ రాజ్ హాజరు

✍ జయభేరి, హైదరాబాద్, జూలై 30 :

బెట్టింగ్ యాప్స్ కేసులో వదల బొమ్మాళీ అంటూ ఈడీ దూకుడు పెంచింది. దీనిలో భాగంగా విచారణకు రావాలంటూ, రానా, ప్రకాష్‌రాజ్, మంచులక్ష్మికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో నటుడు ప్రకాశ్ రాజ్ ఈడీ ముందు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వ్యవహారంలో తనకు నిర్వాహకుల నుంచి ఎటువంటి డబ్బులు అందలేదని

...మిగతాది 2 లో

# ధర్మస్థలలో ధర్మం లేదా

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఆగస్టు 4న నల్గొండలో స్కూల్ భూమి పూజ

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. బీసీ,ఎస్సీ ,ఎస్టీ,మైనారిటీ పేద విద్యార్థులకు కార్పోరేట్ కు దీటుగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యను,వరల్డ్ క్లాస్ స్కిల్స్ ను అందించే రెసిడెన్షియల్ స్కూల్ అందుబాటులోకి వస్తే వారి జీవన శైలిలో గణనీయమైన మార్పు వస్తుందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ఈ(YIIRS) రెసిడెన్షియల్ స్కూల్ వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రత్యేక చొరవతో మనసు పెట్టి పనిచేయాలని చెప్పారు. నల్గొండకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమీక్షలో ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ బాల ప్రసాద్,కన్సల్టెన్సీ ప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఉద్యమ బాట

తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు క్షేత్ర స్థాయిలో బీఆర్ఎస్ చేపట్టాల్సిన కార్యాచరణపై ఎర్రవెల్లిలోని తన ఫాంహౌస్‌లో కేసీఆర్ మంగళవారం నాడు సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, జి. జగదీశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఏపీ ప్రయోజనాలను కాపాడేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వమే పాలనా విధానాలను అమలుచేయడం దుర్మార్గం అన్నారు.

తమను నమ్మిన ఓటు వేసిన పాపానికి తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత అన్యాయం చేస్తుందని కేసీఆర్ మండిపడ్డారు. రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు వైఖరిని తీవ్రంగా ఎండగట్టాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. చంద్రబాబు, ప్రధాని మోదీల ప్రయోజనాలు కాపాడేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తహతహ లాడుతున్నారని, ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం తరహాలో ఇతర విభాగాలను బలోపేతం చేసి రాష్ట్ర వ్యాప్తంగా రైతు సమస్యలు, ఇతర అంశాలపై బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగానే ఉపయోగించకుండా, రైతులకు అన్యాయం చేస్తున్నారని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వానాకాలం నాట్లు అయిపోతున్నా, ప్రాజెక్టులలో నీళ్లు ఉన్నా.. ఇప్పటివరకూ రైతులకు సాగునీరు అందించని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజాక్షేత్రంలో నిలదీయాలని దిశా నిర్దేశం చేశారు.

తక్షణం కన్నేపల్లి పంప్ హౌస్ దగ్గర గోదావరి జలాలను ఎత్తిపోయాలని ప్రభుత్వాన్ని కేసీఆర్ డిమాండ్ చేశారు. . పంపులను ఆన్ చేసి, నీళ్లు ఉన్న సమయంలోనే చెరువులు, రిజర్వాయర్లను ఎందుకు నింపడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. రైతులు వరి నాట్లు వేసుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుంది. ఇది క్షమించరాని నేరం.

రైతుల పక్షాన నిలిచి, వారి తరపున బీఆర్ఎస్ పోరాటం మరింత ఉధృతం చేయాలి. కాంగ్రెస్, బీజేపీ దొందు దొందేనని.. పరస్పరం విమర్శలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. రెండు పార్టీలను బీఆర్ఎస్ శ్రేణులు ప్రజాక్షేత్రంలో గట్టిగా నిలదీయాలన్నారు. తెలంగాణ ప్రజలకు అండగా నిలిచేది, వారి కోసం పోరాడేది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటేనని అన్ని వర్గాల్లో నమ్మకాన్ని పెంచాలని పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. రేవంత్ రెడ్డి ఏడాదిన్నర పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, తెలంగాణలో అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమం కొనసాగాలన్నా బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

## రేవంత్.. కళ్లు తెరువు

కాపాడాలని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ప్రశ్నించిన వారిపై, ప్రతిపక్షాలపై జులుం ప్రదర్శించే రేవంత్ తమ సమస్యలు పరిష్కరించాలంటూ పాదయాత్ర చేస్తున్న ఈ గురుకుల విద్యార్థులకు ఏమని సమాధానం చెబుతావని ప్రశ్నించారు. పరిపాలన గాలికి వదిలేసి, అనునిత్యం రాజకీయాలు చేసే రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి గురుకుల విద్యార్థుల గోస కనిపించకపోవడం ఆమానవీయం. తరగతి గదుల్లో ఉండాల్సిన భావి భారత విద్యార్థులను నడిరోడ్డు ఎక్కించిన దుర్మార్గ చరిత్ర ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది. చదువుకోవాల్సిన పిల్లలను పట్టెడు అన్నం కోసం, తాగు నీళ్ళ కోసం పాదయాత్రలు చేసే దుస్థితి కల్పించింది నీ అసమర్థ పాలన. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు, సమస్యలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదిక అడిగినా ప్రభుత్వంలో చలనం కలుగదా? రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరువు.. మీ పాలనలో రోజు రోజుకీ పతనమవుతున్న గురుకుల వ్యవస్థను గాడిన పెట్టు. జోగులాంబ గద్వాల్ జిల్లా, అలంపూర్ చౌరస్తా నుంచి పాదయాత్రగా వెళ్లి జిల్లా కలెక్టర్ కు విద్యార్థులు ఇవ్వాలనుకున్న ఫిర్యాదుకు తక్షణం పరిష్కారం చూపించు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసం మరోసారి పాదయాత్ర డ్రామాలు మొదలు పెడుతున్న కాంగ్రెస్ పార్టీ.. గురుకుల విద్యార్థులు చేస్తున్న పాదయాత్రల మీద ముందు దృష్టి సారించాలని అన్నారు.

## సింగపూర్ పర్యటన సూపర్ సక్సెస్

నిరంతరం చర్చలు, సంప్రదింపులు జరిపారు. సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాన మంత్రి, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్, అలాగే వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి టాన్ సీ లెంగ్, సెక్యూరిటీ, హోం వ్యవహారాల మంత్రి కె.షణ్ముగం తదితరులతో సీఎం సమావేశమయ్యారు. ఏపీసింగపూర్ మధ్య సహకారాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలోనూ భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. గత పాలకుల చర్యల కారణంగా ఏపీ సింగపూర్ మధ్య దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించటంలో ముఖ్యమంత్రి సఫలీకృతం అయ్యారు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులు మళ్లీ ఆంధ్రప్రదేశ్ వైపు తిరిగి చూసేలా చేయగలిగారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకునేందుకు వచ్చినట్టు అక్కడి ప్రభుత్వ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించి చెప్పారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాల్సిందిగా సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధుల్ని సీఎం ఆహ్వానించారు. సింగపూర్ లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే పర్యటన ఆసాంతం ముఖ్యమంత్రి బృందానికి సహాయ సహకారాలు అందించారు.

## కోర్టు సరిపోదు.. స్టేడియం కావాలేమో

తాజాగా ఈ కేసు సుప్రీంకోర్టు వరకు చేరడంతో ఆయన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇంతకు ముందు ఈ కేసులో మంగళవారం సైతం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. కుంభకోణంలో 2వేలమందికి పైగా నిందితులుగా పేర్కొంటూ.. బాలాజీకి సంబంధించిన కేసుల విచారణను ఆలస్యం చేయడానికి తమిళనాడు ప్రభుత్వం చేసిన ప్రయత్నంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. మనీలాండరింగ్ కేసులో బెయిల్ మంజూరైన కొద్దిరోజులకే తిరిగి మంత్రిగా నియమించడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. గత ఏడాది సెప్టెంబర్ 26న బెయిల్ రాగా.. 29న ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్టాలిన్ కేబినెట్ లో గతంలో నిర్వహించిన శాఖలనే మళ్లీ కేటాయించారు.

## దూసుకెళ్లిన నిసార్ ఉపగ్రహం

అదేవిధంగా సహజ విపత్తులను, పర్యావరణ మార్పులను ట్రాక్ చేయడంలో నిసార్ ఉపగ్రహం కీలకపాత్ర పోషించనుంది. నిసార్ (నాసాఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) అనేది ఒక చారిత్రాత్మక ప్రాజెక్టు అని ఇస్రో, నాసా సైంటిస్టులు చెబుతున్నారు. ఇది డ్యూయల్‌ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్ (నాసా ఎల్‌బ్యాండ్, ఇస్రో ఎస్‌బ్యాండ్)ను ఉపయోగించి భూమిని మొదటిసారిగా పరిశీలించనుందని తెలిపారు. ఉపగ్రహం నిర్ణీత కక్ష్యలోకి చేరిన తర్వాత అది ప్రతి 12 రోజులకు భూమిని, మంచుతో కప్పబడిన ఉపరితలాలను 242 కిలోమీటర్ల వెడల్పుతో అధికరిజల్యూషన్ చిత్రాలతో స్కాన్ చేస్తుందని వెల్లడించారు. అందుకోసం మొదటిసారిగా స్వీప్‌సార్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

# ధర్మస్థలలో ధర్మం లేదా

**ధర్మస్థల. ఇదొక కర్ణాటక తిరుమల కొండల్లో వెలసిన ఈ మంజునాథ స్వామి ఆలయానికి విశేషమైన చరిత్ర. అలాంటి చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రంలో వరుస హత్యలు. అందునా మహిళలు, యువతులు, మైనర్ బాలికలున్నారా? ఒక సఫాయి కార్మికుడు చెబుతున్న సాక్ష్యం ద్వారా అసలేం జరుగుతోంది? ఈ మొత్తం ఉదంతం ద్వారా వెలుగులోకి వస్తోన్న కఠిన వాస్తవాలేంటి?**



1995, 2014 మధ్య కాలంలో.. తాను తన చేతుల మీదుగా కొన్ని వందలాది శవాలను నేత్రావతీ పరిసర ప్రాంతాల్లో ఖననం చేశానని అంటాడు. ఈ పక్కనే ఉన్న అడవుల్లో కొన్ని మృతదేహాలను దహనం కూడా చేశాననీ చెప్పుకొచ్చాడు. మరి కొన్ని మృతదేహాలను తాను నదిలో పాడేశానని అనడం విన్న పోలీసులకు మొదట అర్థం కాలేదు. బెళ్తంగడి న్యాయస్థానంలో కూడా వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో ఒక్కసారిగా ఈ వార్త రాష్ట్ర వ్యాప్త సంచలనంగా మారింది. సీఎంని కలిసిన సుప్రీం రిటైర్డ్ జడ్జ్. ఇతడిచ్చిన వాంగ్మూలంతో ఒక యూట్యూబర్ వీడియో రూపొందించడంతో.. అది అర మిలియన్ వ్యూస్ పోయింది. దీనిపైనా కేసు బుక్ అయ్యింది. ఆ సరికే అది జనబాహుళ్యంలోకి విస్తృతంగా వెళ్లడంతో.. ఈ కేసు, దాని వివరాలు తీవ్ర ప్రకంపనలు నమోదు చేయడం మొదలైంది. అదెలాగంటే సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి గోపాల గౌడ సీఎం సిద్ధరామయ్యను కలసి.. ఈ కేసు దర్యాప్తు ముమ్మరం చేయాలని కోరారు. ఇందులో మహిళలు, యువతులు, మైనర్ బాలికలు సైతం ఉండటం గుర్తించిన కర్ణాటక మహిళా కమిషన్ సైతం ప్రభుత్వాన్ని దర్యాప్తు పై ఒత్తిడి చేసింది. ఆలయ ధర్మకర్తలు జైన్లు, శివుడికి వైష్ణవ పూజలు జరిగే ధర్మస్తల. ఈ మాజీ సఫాయి కార్మికుడు చెప్పినదంతా ఎలా నమ్మాలి? కొన్నేళ్ల తరబడి ఎంతో నిష్టాగరిష్టతలతో తులతూగుతున్న ఆలయ ప్రాంతానికి ఇంతటి అప్రదిష్ట మూటగట్టడమా? దానికి తోడు ఈ ఆలయ ప్రాంతం పేరే దర్మస్థల. ఇక్కడ ధర్మ దేవత ధర్మాన్ని నాలుగు పాదాలా నడిపిస్తుందని అంటారు. ఇదొక ఆధ్యాత్మిక త్రివేణీ సంగమం. ఆంధ్రకు వెంకటేశ్వరస్వామి వారు ఎలాగో కర్ణాటకలో మంజునాథ స్వామి వారు అలాగ. ఇక్కడ వంశపారంపర్య ధర్మకర్తగా ఎంపీ వీరేంద్ర హెగ్డే ఉన్నారు. ఈయన ఇక్కడ దాదాపు ఒక సమాంతర న్యాయ వ్యవస్థను నడుపుతారు. ఈ ఆలయం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్య, వైద్య సేవలు విశేషంగా అందుతాయి. కుటుంబ వ్యాపార ఇతర సమస్యలేవైనా వస్తే ఈ ప్రాంతానికే తలపెద్దగా భావించే హెగ్డే దగ్గరకొచ్చి తమ సమస్యలు పరిష్కరించుకుంటారు. ఎన్నో జంటలకు ఎంపీ వీరేంద్ర హెగ్డే ఇచ్చే తాళిబొట్టుతో పెళ్లిళ్లు జరుగుతుంటాయి. ఇక్కడ ధర్మం నాలుగు పాదాలా నడుస్తుందనడానికి ఎన్నెన్నో ఉదాహరణలు. అలాంటి ధర్మస్థల లో వందలాది హత్యలు జరిగాయని తెలియడంతో ప్రపంచమంతా షాకైంది. కంప్లయింట్ చేసిన తల్లిని బెదిరించి పంపిన పోలీసులు. ఇంతకీ ఇతడు చెప్పేదేంటని చూస్తే తన చేజేతులా.. ఎన్నో శవాలకు ఖననం, దహనం నిర్వహించానని అంటాడాయన. అంతే కాదు తనకు ఇష్టం లేకపోయినా ఎందరో మహిళలు, యువతులు, మైనర్లు మృతదేహాలను ఖననం చేశానని చెప్పుకొచ్చారు. 2010లో తానిలాగే ఒక స్కూల్ డ్రెస్ వేసుకున్న మైనర్ బాలిక మృతదేహాన్ని ఖననం చేశానని అంటాడీ మాజీ పారిశుధ్య కార్మికుడు. అంతే కాదు 2003లో అనన్య భట్ అనే ఒక ఎంబీబీఎస్ స్టూడెంట్ తన స్నేహితులతో కలసి ధర్మస్తలకు వచ్చి.. ఆపై కనిపించకుండా పోయింది. ఆ సమయంలో మృతురాలి తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు ఆమెను బెదిరించి పంపారని అంటారు.

ఇక 2012లో సౌజన్య అనే మరో యువతి హత్యాచారం కేసు పై కూడా కొంత కాలంగా వివాదం చెలరేగుతోంది. తనకు ప్రాణ హాని ఉందంటోన్న మాజీ పారిశుధ్య కార్మికుడు. ఇంతకీ ఈ సఫాయి కార్మికుడు ఇక్కడి నుంచి ఎందుకెళ్లాడు? ఆ వివరాలేంటని చూస్తే.. 2014లో తన కుటుంబానికి చెందిన మైనర్ బాలికను సైతం ఇలాగే లైంగికంగా వేధించారు. దీంతో తనకు విరక్తి వచ్చి ఇక్కడి నుంచి వెళ్లిపోయానని అంటాడాయన. తనలోని పాపభీతి ఇన్నాళ్లకు నిజం బయటకొచ్చేలా చేసిందని.. తాను గత కొంత కాలంగా అపరాధభావంతో కుమిలిపోతున్నట్టు చెప్పుకొచ్చారీ మాజీ పారిశుధ్య కార్మికుడు. తానీ పని చేస్తున్నప్పటి నుంచి తప్పుగానే భావించాననీ.. అయితే బలవంతానా తన చేత ఈ దుర్మార్గపు పని చేయించారనీ.. లేదంటే చంపేస్తామంటూ బెదిరించేవారని చెబుతాడీ మాజీ సఫాయి కార్మికుడు. తనకు ప్రాణహాని ఉందని కూడా చెబుతాడితను.. ఇక్కడి వంశపారంపర్య పాలనా పరంపర అలాంటిది. అందుకే ఈ ఆలయ ధర్మకర్త వీరేంద్ర హెగ్డేకి రాజ్యసభ్యత్వం ఇచ్చి గౌరవించింది కేంద్ర ప్రభుత్వం. ఆయన ఇది వరకే పద్మ పురస్కారాలతో పాటు ఇంకా ఎన్నో విశేష పురస్కారాలు అందుకున్నారు. ధర్మస్తల అంటే ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో అంతటి అశేష సామాజిక ప్రాధాన్యత ఉంది. కార్యమేదైనా హెగ్గే అనుమతి తీస్కునే స్థానికులు. వీరేంద్ర హెగ్డే వీరికొక ధర్మాధికారి మాత్రమే కాదు. అంతకన్నా మించి. ఆయనకు పరోపకారి అన్నదొక బిరుదు. ఈ ప్రాంత కీర్తి ప్రతిష్టల పతాక.. హెగ్డే కుటుంబం. ఈ ఆలయ చరిత్రతో ఈ జైన కుటుంబ చరిత్ర అంతగా మమేమకమై కనిపిస్తుంది.

వీరేంద్ర హెగ్డే కుటుంబం తరతరాలుగా ఇక్కడి స్థానికుల నుంచి నీరాజనాలు అందుకుంటోంది. ఈ ప్రాంత వాసుల ఇంట్లో ఏ శుభకార్యం జరగాలన్నా ఆ మంజునాథుడే తమకు ఆనతిచ్చినట్టుగా హెగ్డే దగ్గరకు వచ్చి అనుమతి తీసుకుని వెళ్తారు. అంతగా ఇక్కడి ఆచార వ్యవహారాలు నడుస్తాయి. వారికేదైనా వివాదం వచ్చినా తీర్చుకోడానికి ఇక్కడికే వస్తుంటారు. గతంలో గ్రామ పెద్దలు, ఊరి పెద్దల పంచాయితీలు తీర్పులు ఎలా సాగేవో.. ఇప్పటికీ ఇక్కడ అలాగే కొనసాగుతుంటాయి. ధర్మస్థల ఉదంతానికి సంబంధించి 8,842 పోస్టులు. వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ధర్మస్తల ఉదంతానికి సంబంధించిన 8, 842 లింకులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. గతంలో తమ దగ్గర పని చేసిన పారిశుధ్య కార్మికుడు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఫుటేజీ పూర్తిగా తొలగించాలని, వీటిని డీ ఇండెక్స్ చేయాలని కోరారు హర్షేంద్ర.

అంతే కాదు.. తన పిటిషన్లో ఆయన ఎక్స్, ఫేస్ బుక్, థ్రెడ్ వంటి ప్లాట్ ఫామ్స్ పై పోస్టుల గురించి కూడా ప్రస్తావించారు. ఈ వివాదంపై పలు యూట్యూబ్ చానెళ్లు, సోషల్, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాలో ప్రచురించడం, ప్రసారం చేయడం, ఫార్వర్డ్ చేయడం అప్ లోడ్ చేయడాన్ని నిషేధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మస్థల మిస్టరీ మరణాల వివాదం అయితే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా వైరల్. కారణమేంటంటే ధర్మస్తల ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే ఒక రాజ్యసభ ఎంపీ. ఇంతటి ప్రశాంత వాతావరణంలోని ఈ ఆధ్యాత్మిక కేంద్రంలో ఇలాంటి మారణకాండ జరగటమేంటి? ఇంతకాలం ఇదెలా గుట్టుగా ఉంది? ఎవరికీ అనుమానం రాలేదు ఎందుకని? నదిలోనూ కొన్ని మృతదేహాలు పడేశానని ఆ పారిశుధ్య కార్మికుడు చెబుతుంటే.. మరి అప్పుడే ఆ మృతదేహాలు ఎక్కడో ఒక చోట తేలి.. కనిపించేవి కదా? ఒకటి రెండు తప్ప .. మరే కేసు కూడా ఇప్పటి వరకూ ఎందుకు వెలుగులోకి రాలేదన్నది షాకింగా ఉంది. ఇటు ప్రభుత్వమే కాదు అటు, హెగ్డే కుటుంబం కూడా దీన్నించి ఎలా బయట పడాలో అర్థంకాక సతమతమవుతోంది. మరి చూడాలి.. ఈ కేసు ఏ మలుపు తీసుకుంటుందో తేలాల్సి ఉంది.



## ఈడీ విచారణకు ప్రకాష్ రాజ్

సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో ఆయన బుధవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. ఈడీ అధికారులు ఆయనను దాదాపు ఐదు గంటల పాటు విచారించారు.విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బెట్టింగ్ యాప్‌లతో డబ్బులు సంపాదించవచ్చని ఎవరూ భావించవద్దని సూచించారు. ఇక నుంచి అలాంటి వాటికి తాను ప్రచారం చేయనని స్పష్టం చేశారు. ఈడీ అధికారులు తాను చెప్పిన విషయాలను నమోదు చేసుకున్నారని చెప్పారు. తనను మరోసారి విచారణకు రావాలని ఇప్పుడైతే చెప్పలేదని అన్నారు.తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు జరుపుతోంది. బెట్టింగ్ యాప్‌లకి సంబంధించి మనీ లాండరింగ్, హవాలా లావాదేవీల ఆరోపణలపై ఈడీ ఫోకస్ చేసింది. మొత్తం 36 బెట్టింగ్ యాప్స్‌కి సంబంధించిన ప్రమోషన్స్‌పై సెలబ్రిటీలపై కేసులు నమోదు చేశారు తెలంగాణ పోలీసులు. ఓ బెట్టింగ్ యాడ్ ప్రమోషన్‌లో ప్రకాష్‌రాజ్ నటించడంతో అతనిపైనా కేసు నమోదైంది. 10రోజులక్రితం నోటీసులు ఇవ్వడంతో ఈరోజు ఈడీ ముందు హాజరయ్యారు ప్రకాష్‌రాజ్.బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్, మనీ లాండరింగ్ వ్యవహారాలకు సంబంధించిన దర్యాప్తును ఈడీ అధికారులు స్పీడప్ చేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసుకు సంబంధించి, విచారణకు హాజరు కావాలని టాలీవుడ్ ప్రముఖ నటీనటులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 23న విచారణకు రావాలని దగ్గుబాటి రానాను ఆదేశించింది. ఈ నెల 30న విచారణకు హాజరు కావాలని ప్రకాష్‌రాజ్‌కు, ఆగస్టు 13న ఎంక్వైరీకి రావాలని మంచులక్ష్మికి నోటీసులు జారీ చేసింది.బెట్టింగ్ యాప్‌లతో జరిగిన అగ్రిమెంట్లు, బ్యాంక్ ఖాతాల వివరాలు తీసుకుని రావాలని టాలీవుడ్ సెలబ్రిటీలను ఆదేశించింది. ఇక ఇదే కేసులో పేర్లున్న మిగతా నటీనటులకు సైతం దశలవారీగా సమన్లు జారీ చేయనున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంలో మొత్తం 29 మంది నటీనటులతో పాటు కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సలర్లపై విచారణ జరుగుతోంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై పంజాగుట్ట, మియాపూర్, సైబరాబాద్, విశాఖపట్నంలో పోలీసులు నమోదు చేసిన FIRల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగి విచారిస్తోంది. బెట్టింగ్స్ యాప్స్ వల్ల తెలంగాణ ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆన్‌లైన్ యాప్స్‌ను విచ్చలవిడిగా ప్రమోట్ చేయడంతో.. ప్రజలు కూడా ఆకర్షితులై.. వాటిలో డబ్బులు పెట్టి నష్టపోయారు. కొందరు లక్షలాది రూపాయలు కోల్పోయారు. దీంతో బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో ప్రమోటర్స్‌గా ఉన్న సినీ సెలబ్రిటీలు, యూట్యూబర్స్ పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్.. ECIR నమోదు చేసింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోటింగ్ చేసినందుకు కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఈడీ గుర్తించి ఈసీఐఆర్ నమోదు చేసింది. మనీ లాండరింగ్ కోణంలో కూడా ఈడీ దర్యాప్తు సాగుతోంది.

## విడాకుల వలన విలువలు తగ్గించుకుంటున్నారు

యాక్టివ్‌గా ఉండే అనసూయ గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కుర్రాళ్లకి కంటిపై కునుకు లేకుండా చేస్తుంటుంది. ఇక ఇంటర్వ్యూలలో ఆమె ఏ విషయంపైనైన చాలా ఓపెన్‌గా మాట్లాడుతుంది. తాజాగా తన భర్తకి సంబంధించిన కొన్ని విషయాలు చెప్పుకొచ్చి అందరిని ఆశ్చర్యపరిచింది మా ఆయన పర్‌ఫెక్ట్ అని అందరు అనుకుంటారు. కాని ఆయన కూడా అందరి మగాళ్లలాగే . మా ఇద్దరి మధ్య కూడా కొన్ని సందర్భాలలో గొడవలు అయ్యాయి.

నేను వెళ్లి కొంతమందిని కలవడం. కొంతమందితో సినిమాలు చేయడం ఆయనకి నచ్చలేదు. ఆ సమయంలో చాలా ఇబ్బందులు పడుతూ గొడవలు పడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. నేను హీరోలతో.. పెద్ద పెద్ద స్టార్‌లతో.. గుడ్ లుకింగ్ పీపుల్‌స్‌తో ఇంట్రాక్ట్ అయినప్పుడు చాలా ఇబ్బంది పడేవారు. అబ్బాయిల మనస్తత్వమే అది. నన్ను ఫ్లర్ట్ చేయడం కావచ్చు.. కాంప్లిమెంట్ కావచ్చు.. ఆయన తీసుకోలేరు. సాధారణంగా అందరు కూడా అనసూయ భర్త అన్నీ చేయనిస్తాడు, అన్నింటికి ఒప్పుకుంటాడు అని అందరు అనుకోవచ్చు. వాడు చేతకాని వాడు అని కూడా అంటారు. అదృష్టం ఏంటంటే మా ఆయనకి తెలుగు రాదు. సోషల్ మీడియాలో కామెంట్స్ పట్టించుకోడు. ఆయనలా ఉండాలని ఎన్నోసార్లు అనుకుంటాను.నేను మా ఆయనతో ఉన్నట్టు వేరే వాళ్లతో ఉండలేను. నాకు వేరే వ్యక్తి బ్యాడ్‌గా అనిపిస్తే.. నేను అతనికి బ్యాడ్‌గా కనిపిస్తా. అది హ్యూమన్ బిహేవియర్ అంతే. నేను కూడా మా ఆయనతో ఇన్‌సెక్యూరీగా ఫీల్ అయిన సందర్భాలు ఉన్నాయి. అనసూయకి అసూయ అనేది వాళ్ల ఆయన దగ్గర మాత్రమే ఉంటుంది. ఇంకెక్కడా ఉండదు. నేను మోస్ట్ సెక్యూర్డ్ పర్సన్‌ని. ఆయన కూడా అలాగే ఫీల్ అవుతారు అని అనసూయ పేర్కొంది.

# విద్యార్థులకు తగిన మౌళిక సదుపాయాలు కల్పించాలి

■ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

**జయభేరి, మేడ్చల్ జిల్లా :**

కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొనుటకు విద్యార్థులకు తగిన మౌళిక సదుపాయాలు కల్పించాలని, నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ప్రిన్స్ పల్ ను ఆదేశించారు.
కీసరలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ యూనిఫామ్స్ టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ పుస్తకాలను అందించారా లేదా అని ఆరా తీసారు, అలాగే హాస్టల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, అదేవిధంగా మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు సమయానికి పౌష్టిక ఆహారాన్ని అందించాలని, వసతి గృహంలో అందుతున్న విద్య బోధన పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఎంత మంది విద్యార్థలు చదువుకున్నారు. ఇంటర్, 10వ తరగతిలో గత సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కళాశాల సిబ్బందిని ఆదేశించారు. సమస్యలు ఎమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని



కలెక్టర్ ప్రశ్నించగా, పరిసర ప్రాంతాల్లో లైట్స్ లేవని, తద్వారా విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని తెలుపగా, లైట్లను తక్షణమే ఏర్పాటు చేయాలని, అలాగే, పరిసర ప్రాంతాల్లో చెత్తచెదారం లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. విద్యార్థులకు మారుతున్న టెక్నాలజీని అవగాహణ కల్పిస్తూ నైపుణ్య సామార్థ్యాన్ని పెంపొందించాలని సంబందిత భోదన సిబ్బందికి సూచించారు. తదనుగుణంగా కంప్యూటర్లను సమకూర్చుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం తరగతి గదులను అయన పరిశీలిస్తూ, 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ గణిత శాస్త్రాన్ని భోదిస్తూ, విద్యార్థుల యొక్క పరిజ్ఞానాన్ని పరిశీలించడానికి విద్యార్థులతోనే బ్లాక్ బోర్డు పై లెక్కలు యొక్క సమాదానాలను చేయించారు. వారితో మాట్లాడుతూ.. అన్ని సబెక్టులలో పట్టు సాధింస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అదిరోహించవచ్చనని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. తదుపరి వంటగదిని సందర్శించి నాణ్యతతో కూడిన పరిశుభ్రంగా ఆహార పదార్థలను తయారు చేయాలని వంట చేసి వాళ్ళకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉన్నదని కలెక్టర్ తెలిపారు. ఆహార పదార్థలను విద్యార్థులు సక్రమంగా తినేవిధంగా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు.



**ఫెర్టిలైజర్ షాపును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ...**

అనంతరం కీసర లోని ఫెర్టిలైజర్ షాపును కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖి చేశారు. ఈ సందర్భంగా ఫెర్టిలైజర్ షాపును ఆయన పరిశీలిస్తూ, స్టాక్ రిజిష్టర్‌ను ప్రకారము ఎంత ఓకే కదా ఎరువులు, క్రిమిసహాకార మందులు కంపెనీల వారిగా ఎంత నిల్వ ఉన్నదని కలెక్టర్ పరిశీలించారు. అదే విధంగా ఎరువులు ఎక్కడ నుండి సరఫరా అవుతాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు, షాపు సిబ్బందితో మాట్లాడుతూ యూరియానే రైతులు అధిక మొత్తంలో వినియోగిస్తున్నందున, ఇతర ఎరువుల పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేనందున దానికి అనుగుణంగా రైతులందరికి ఎరువులు, పురుగుమందులు వినియోగించడం పై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే నకిలీ మందులు, ఎరువులు విక్రయించకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకటరెడ్డి, జిల్లా పాఠశాలల కన్వీనర్ జి. రజినీకాంత్, ప్రిన్సిపల్ టి. మహాలక్ష్మీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ, వ్యవసాయ శాఖ అధికారి మధవి పాల్గొన్నారు.



# బీజెపి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

**జయభేరి, తుర్కపల్లి, జూలై 30 :**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని బూత్ నెంబర్ 66,67 ,68,69 లో స్థానిక సంస్థల ఎన్నికల శక్తి కేంద్ర ఇన్చార్జిలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకు వివరిస్తూ స్థానిక సంస్థల్లో బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, ఆకుల సైదులు, బానోతు శత్రు నాయక్, ఆకుల భాస్కర్ ,బర్మా జంగయ్య, ఆకుల రమేష్ ,చాంద్ పాషా, కందుకూరి చలమయ్య, బోరెడ్డి పురుషోత్తం రెడ్డి, మేకల పాండు, తరుణి శ్రీహరి, ఎలగల భాను, కందుకూరి వేణు, వంశీ, ఆకుల లక్ష్మీ నరసయ్య ,రాకెల బాలరాజు, పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, తుర్కపల్లి, జూలై 30 :**

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పార్వతీ బిక్షపతి, ములకలపల్లి గ్రామానికి చెందిన పిఏసిఎస్ డైరెక్టర్ దుంబాల రామచంద్రయ్య తల్లి దుంబాల ఎల్లమ్మ ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను బుధవారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సాగర్ల పరమేష్ యాదవ్, పిఏసిఎస్ డైరెక్టర్ చెక్కల మల్లేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఇరగదీడ్ల శ్రీశైలం నాయకులు భూక్య రవీందర్ నాయక్, మాజీ సర్పంచులు హరి నాయక్, ఇమ్మడి మల్లప్ప, మేకల బాలకృష్ణ ,భాస్కర్ నాయక్, లచ్చిరాం, లక్ష్మీనరసింహారెడ్డి, అంజిరెడ్డి, వంగరి రమేష్, ఆలేరు నియోజకవర్గ యూత్ లీడర్ కసరబోయిన కనకరాజు యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మోడెం వంశీకి పేరూరు ఎస్సై ఆర్థిక సాయం



**జయభేరి, వాజేడు జులై 30 :**

పవర్ లిఫ్టింగ్ ఇండియా తరఫున ఇంటర్నేషనల్ కు ఎంపికైన మేడెం వంశి నార్త్ అమెరికాలో జరుగుతున్న పవర్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొనటానికి 4 లక్షలు ఖర్చు అవుతుందని అతడు నిరుపేద కుటుంబానికి చెందినవారు. నార్త్ అమెరికా కు వెళ్ళుటకు పలు రాజకీయ పార్టీ నాయకులు తోటి బంధుమిత్రులు తగు సాయం అందించారు. అలాగే పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ దేశానికి కన్నా ఊరికి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని అన్నారు.చెరుకూరు ఫెర్టిలైజర్ షాప్ కొత్తగట్టు సంతోష్ తగు ఆర్థిక సాయం చేశారు.




# ప్రధానమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

■ అంబేద్కర్ చౌరస్తా వద్ద పాలాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు



**జయభేరి, వర్గల్, జూలై 30 :**

పీఎం శ్రీ పథకం ద్వారా వర్గల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు రూ 40.50 లక్షలు, (సైన్స్ లాబ్, అధనపు తరగతులు) నిధులు మంజూరు కావడం సంతోషమని వర్గల్ మండల అధ్యక్షుడు బోల్లిపల్లి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. సందర్భంగా వర్గల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధానమంత్రి మోడీ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు చిత్రపటాలకు పలాభిషేకం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మెదక్ పార్లమెంట్ పర్యటనలో భాగంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు కృషితో వర్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపిక కావడం సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శ్రీరామ్ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్, ఉపాధ్యక్షుడు దిండి నాగరాజు, జంగం యాదగిరి మాజీ ఉపాధ్యక్షులు జాలిగామ శంకర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు టేకులపల్లి నరేందర్ రెడ్డి, శ్రీనాథ్, అధ్యక్షులు మణికాంత్, నూక బద్రినాథ్, బబ్బూరి వెంకట్ నర్వ శ్రీపతి, మన్నే రాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# బెల్ట్ షాపులను నిషేధించాలి

■ మోహన్ నాయక్, గిరిజన సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి

**జయభేరి, దేవరకొండ :**

నల్గొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల సమీపంలో అనేక బెల్ట్ షాపులు (ప్రముఖంగా బెల్ట్ షాపులు) వీటికి చెందిన సిట్టింగ్ రూములు పనిచేస్తున్నాయని స్థానిక గిరిజన సంఘం, ప్రజలు గమనించారు. రాష్ట్ర, కేంద్ర నియమాల ప్రకారం పాఠశాలల నుండి కనీసం 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండకూడదు. పాఠశాలల సమీపంలో ఈ రకమైన దుకాణాలు విద్యార్థుల భద్రతను ప్రభావితం చేస్తాయి, ముఖ్యంగా పిల్ల అమ్మాయిలకు వేధింపులు, దూషణలు ఎదురవుతుండడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి బెల్ట్ షాపులు విద్యా వాతావరణాన్ని అడ్డుకుంటూ, విద్యార్థుల భద్రతను ప్రమాదంలో పెడుతున్నాయి. అందువల్ల, గిరిజన సంఘం తరఫున మేము డిమాండ్ చేస్తున్నాము. నల్గొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుండి 100 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని బెల్ట్ షాపుల సర్వే చేసి, ప్రజలకు తెలియజేయాలి. ఈ నియమావళులను ఉల్లంఘిస్తున్న బెల్ట్ షాపులు తనిఖీలు చేసి, బంద్ చేయించాలి. ఈ నియమ ఉల్లంఘనలు నివారించేందుకు రెగ్యులర్ మానిటరింగ్ నిర్వహించాలి, ప్రజల సహకారంతో సరైన చర్యలు తీసుకోవాలి. పాఠశాలల సమీపంలో ఈ షాపుల వల్ల ఎదురయ్యే వేధింపులు, ఎటువంటి ఇబ్బందులు వస్తే వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. జిల్లా పరిపాలన, మద్యం అధికారి, పోలీసు అధికారులు మరియు పాఠశాల నిర్వహణ ఈ విషయాన్ని ప్రాధాన్యతగా స్వీకరించి విద్యార్థుల భవిష్యత్తు, గౌరవాన్ని రక్షించాలని అభ్యర్థించుతున్నాము.



# కబ్జా నుంచి ప్రభుత్వ భూమి కాపాడండి

■ ఫరూక్ నగర్ డిప్యూటీ ఎమ్మార్వో ఆనంద్ సింగ్ కు వినతి పత్రం అందజేసిన గిరిజన సంఘాల నేతలు

**జయభేరి, షాద్ నగర్, జులై 30 :**



ప్రభుత్వం కేటాయించిన బంజార భవన్ భూమిని ఆక్రమణ నుండి కాపాడి హద్దు బందులు చూపించాలని కోరుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఫరూక్ నగర్ మండల డిప్యూటీ ఎమ్మార్వో ఆనంద్ సింగ్ కు బుధవారం వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్ ఎస్ పి ఎస్ రాష్ట్ర నాయకులు మంగులాల్ నాయక్ గిరిజన ఆదివాసి కాంగ్రెస్ జిల్లా చైర్మన్ శీను నాయక్ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ నాయక్ ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు బాలు నాయక్ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకులు శ్రీను నాయక్ తదితరులు మాట్లాడుతూ... షాద్ నగర్ నియోజకవర్గంలోనీ ఫరూక్నగర్ మండల పరిధిలోని గుండ్లకుంట గ్రామ రెవెన్యూ శివారులో సర్వేనెంబర్ 12/P ఒక ఎకరా ప్రభుత్వ భూమిని తేదీ 038 2023 జీవో నెంబర్ NIT NO SE/TW/176/202324 ద్వారా బంజారా భవన్ నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని కేటాయించడంతోపాటు నిర్మాణం కోసం రెండు కోట్ల రూపాయలు అంచనా వేసి కేటాయించడం జరిగిందని అట్టి భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా కబ్జా చేయడం జరిగిందని కావున బంజారా భవన్ భూమిని కబ్జా నుంచి కాపాడి బంజారా భవన్ నిర్మాణం కోసం హద్దు బందులు చూపించాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు.

# జూలురి సుశీలమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమం

■ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి

**జయభేరి, చింతపల్లి:**



చింతపల్లి మండలం తీదేడు గ్రామానికి చెందిన జూలురి శ్రీధర్ మాతృమూర్తి జూలురి సుశీలమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి పాల్గొని ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట తీదేడు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సోనగంటి గోవర్ధనాచారి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, చింతపల్లి BRS యూత్ అధ్యక్షులు సిమర్ల కృష్ణ యాదవ్, మద్రు శ్రీనివాసరావు, జెల్లా వెంకటేశ్వర్లు, వీరమల్ల జగదీష్, ఉడుత శంకరయ్య, వలమోని వెంకటయ్య, సందె దేవయ్య, గ్రామ పెద్దలు మోర కిరణ్, దాసరి మల్లయ్య, నేలపట్ల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.





## ఇందిరానగర్ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారి కృషి హర్షనీయం

- ఇందిరా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బివి నరసింహారెడ్డి

**జయభేరి, కుషాయిగూడ, జూలై 30 :**

తమ కాలనీలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించేందుకు కృషి చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఇందిరానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి.వి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. జలమండలి నుంచి 15 లక్షల రూపాయలు తో చేపట్టనున్న యూజిడి పైప్ లైన్ నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష కార్యదర్శులు నరసింహారెడ్డి భాస్కరాచారి మాట్లాడుతూ.. యుజిడి పైప్లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి,కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కాటేపల్లి శివారెడ్డి, ప్రతినిధులు సారా అనిల్ కుమార్, రాధాకృష్ణమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, రాంప్రసాద్, పిట్టల విజయ్ వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, మొగిలి రాఘవరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దాసరి కనకయ్య, జై కృష్ణ, సందీప్, శ్రీనివాస్, ప్రసాద్ రెడ్డి, సాయిబాబా, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తలను పరామర్శించిన మురళీకృష్ణ యాదవ్



**జయభేరి, షాద్ నగర్, జులై 30 :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు చెన్నయ్య, స్వామి ఉదయం రోడ్డు ప్రమాదంలో గాయపడడం జరిగింది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మురళీకృష్ణ యాదవ్ షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వారిని కలుసుకొని పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... క్షతగాత్రులకు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బంది ఉన్న తనకు తెలియజేయాలని అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. తన కార్యకర్తలు అంటే తమ కుటుంబ సభ్యులుగా భావిస్తానని ఎవరికి ఏ ఆపద వచ్చినా ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. గాయాలైన తమ కార్యకర్తలు త్వరగా కోలుకోవాలని అన్నారు. మురళీ యాదవ్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఎన్.శ్రీను, మాల మల్లేష్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


## ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వనమహోత్సవ కార్యక్రమం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని ఎం. కె. ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్లో NSS విభాగం Unit 1&2 ఆధ్వర్యంలో 'వన మహోత్సవ కార్యక్రమం' ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి ఆధ్వర్యంలో NSS POS,NSS వాలంటీర్లు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి కోటయ్య, IQAC కోఆర్డినేటర్ డాక్టర్. కె పృథు, అకాడమిక్ కోఆర్డినేటర్ ch. లింగమయ్య, NSS POS డాక్టర్ వి .మకట్లాల్, SK.అరీఫా COE జి లింగారెడ్డి, డాక్టర్ .ఎం. ప్రభాకర్, డాక్టర్ కే రేణుక, సురేష్, వెంకటేష్, నాగరాజు, జగపతిబాబు,హనుమ, శ్రీను నర్మదా, , జగపతిబాబు, కమల, శివ, A వెంకట్ రెడ్డి, P.మధు నాయక్ తదితర అధ్యాపక, అధ్యాపకేతర బృందంతో పాటు విద్యార్థిని , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శిగా గోనె శ్రీనివాస్




**జయభేరి, మేడిపల్లి :**

మునురు కాపు సంగం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి గా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి గోనె శ్రీనివాస్ పటేల్ కి రాష్ట్ర మునురు కాపు సంగం అధ్యక్షులు సర్దార్ పుట్టాం పురుషోత్తం నియామక పత్రాన్ని ఇవ్వడం జరిగింది. గోనె శ్రీనివాస్ మాట్లాడుతూ.. నా పై నమ్మకం ఉంచి నాకు బాధ్యత ఆపగించిన అధ్యక్షులు వారికి ధన్యవాదములు తెలజేస్తూ.. మునురు కాపు పెద విద్యార్థులకు.. పేద కుటుంబాలకు సేవ చేస్తానని.. మునూరు కాపు కుల అభివృద్ధికి నా సమయం ఇచ్చి పనిచేస్తానని తెలియ జేస్తున్నాను. ఈ కార్యక్రమంలో కొండా ప్రదీప్, సింగం నరేందర్, బాలరాజ్, శంకర్ షేర్ శంకర్ అన్నా పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగంలో.. విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఇక్రిసాట్

- నూతన సాంకేతికతతో అద్భుతమైన వంగడాల సృష్టి
- దేశంలోనే మొట్టమొదటి వ్యవసాయ పరిశోధన సంస్థ ఇక్రిసాట్
- ఇక్రిసాట్ తో ఎంఓయు కుదుర్చుకున్న కావేరి విత్తన విశ్వవిద్యాలయం
- ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్

**జయభేరి, వర్గల్, జూలై 30 :**



వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఇక్రిసాట్ దేశంలోనే మొట్టమొదటి వ్యవసాయ పరిశోధన సంస్థగా ప్రసిద్ధికెక్కినట్లు ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలోని కావేరి యూనివర్సిటీ, విత్తన సంస్థ, మరియు పరిశోధన కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. నూతన సాంకేతికతతో అద్భుత వంగడాలను సృష్టించి వ్యవసాయ రంగంలో చరిత్ర సృష్టించాలని పేర్కొన్నారు. ఇక్రిసాట్ లోని వివిధ రంగాల సాంకేతికత అందిపుచ్చుకునేందుకు కావేరి యూనివర్సిటీ, విత్తన మరియు పరిశోధన కేంద్రం ముందుకు రావడంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో దేశ పునర్నిర్మాణానికి కావేరి విశ్వవిద్యాలయ విద్యార్థులు ముందుకు రావాలని ఆకాంక్షించారు. అయితే అధునాతన సాంకేతికతను జోడించి నూతన పంటల దిగుబడి, ఉత్పాదతను పెంపొందించి దేశానికి సరిపడా ఆహార సంపదను సృష్టించే లక్ష్యం మన ముందున్నట్లు చెప్పారు. నూతన వ్యవసాయ పరిశోధనలతో ప్రపంచానికి సరిపడా ఆహార సంపదను సృష్టించి ఎగుమతి చేసే సత్తా దేశంలోని వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులకు ఉండగా, ఇప్పటినుండే లక్ష్యసాధనలో ముందుండాలని అన్నారు. విద్యావ్యవస్థతో వినయం సిద్ధిస్తుందని, తద్వారా ఊహించని అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో సరిపెట్టుకోకుండా క్షేత్రస్థాయిలో పంట పొలాలు సందర్శించి వ్యవసాయ పరిశోధనలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కాగా ఇక్రిసాట్ తో ఒప్పందం కుదుర్చుకోవడంతో కావేరి విద్యార్థులు తమ శాస్త్రవేత్తలతో నేరుగా పరిశోధనలో పాల్గొనే అవకాశం దక్కిందని చెప్పారు. హైదరాబాద్ కు ఇక్రిసాట్ మరియు కావేరి యూనివర్సిటీలు సమీపంలో ఉండడం విద్యార్థులు అదృష్టంగా భావించి పరిశోధనల్లో అద్భుతమైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కావేరి యూనివర్సిటీ దేశంలోనే మొట్ట మొదటి అగ్రిటెక్ యూనివర్సిటీ కాగా, విద్య, మరియు పరిశోధనలను నేరుగా వ్యవసాయ క్షేత్రం, రీసెర్చ్ సెంటర్ లోనే కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. నూతన ఆధునిక సాంకేతికత జోడించి దేశంలోని వ్యవసాయ రంగానికి విశిష్ట సేవలందించేందుకు కావేరి యూనివర్సిటీ ముందు వరుసలో ఉండడం శుభపరిణామమని వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశ్రమలు కలిగి ఉన్న కావేరి యూనివర్సిటీ దేశంలోనే మొట్టమొదటిదిగా ప్రసిద్ధికెక్కినట్లు చాన్సలర్ భాస్కరరావు, వైస్ చాన్సలర్ ప్రవీణ్ రావు, వైస్ చైర్మన్ పవన్ రావు పేర్కొన్నారు. తమ సంస్థలో విద్యనభ్యసించిన విద్యార్థులను చక్కటి వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ హర్షరావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి, డీన్ ఆఫ్ టెక్నాలజీ డాక్టర్ కొండా శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు ప్లాట్లను పట్టా చేసి ఇవ్వాలి

**జయభేరి, వర్గల్, జూలై 30 :**



వర్గల్ మండల కేంద్రంలో టిజిఐసిలో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు ప్రభుత్వం అందించే ప్యాకేజీలను త్వరగా ఇవ్వాలని, వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు విద్యుత్ సరఫరాను యధావిధిగా కొనసాగించాలంటూ డిమాండ్ చేస్తూ టీజీఐఐసీ జోనల్ కార్యాలయంలో జోనల్ మేనేజర్ అనురాధకు భూ నిర్వాహితులు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వర్గల్ గ్రామంలో సర్వే నెంబర్ 1510, 1495, 1209, 854లో సుమారు 1200 ఎకరాల భూమిని సేకరించి అరకుర నష్టపరిహారం అందించి భూములను బలవంతంగా లాక్కుంది. అలాగే భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లను మంజూరు చేయడం జరిగింది. భూములను మాత్రం కంపెనీలకు కట్టబెట్టి రైతులను నట్టేట ముంచింది. రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందించి రైతులకు ఇచ్చిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించేంతవరకు భూములను కంపెనీలకు ఇవ్వమని డిమాండ్ చేశారు.

గత 10 నెలల క్రితం భూ నిర్వాసితుల ఇంటి స్థలాలను అన్ని హంగుల్లో అభివృద్ధి పరిచి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి చేపట్టకపోగా రిజిస్ట్రేషన్ కూడా చేయలేదని వాపోయారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయించి రిజిస్ట్రేషన్లు చేసేంతవరకు ధర్నాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.



## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

- కమిషనర్ స్వామినాయక్

**జయభేరి, మేడ్చల్ :**

మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ స్వామినాయక్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు, లక్ష్మీనగర్ కాలనీలలో డిఈ దుర్గాప్రసాద్ తో కలిసి పర్యటించారు. కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ 14వ వార్డులో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరిందని ఇచ్చిన పిర్యాదు మేరకు నీటి ట్యాంక్ ను పరిశీలించారు. అలానే లక్ష్మీనారాయణ దేవాలయ గుండంలో పెద్ద రంధ్రం ఏర్పడటంతో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరారు. సమస్యలను పరిశీలించిన కమిషనర్ స్వామినాయక్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ దుర్గాప్రసాద్, మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, శ్రీకాంత్, విక్రమ్, ప్రదీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ మున్సిపాలిటీని సందర్శించిన సిడిఎంఏ జాయింట్ డైరెక్టర్

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పురపాలక సంఘంనకు సి.డి.ఎం.ఏ. జాయింట్ డైరెక్టర్ బి. శ్రీనివాస్ విచ్చేసి 100 రోజుల ప్రణాళిక లో భాగంగా ఖిల్లా పార్కును సందర్శించి మొక్కలు నాటారు. ఎస్.టి.పి. (సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) మరియు డంపింగ్ యార్డును సందర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నందు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి 202425 సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షన్ లో రాష్ట్రంలో 21 వ ర్యాంకు సాధించినందుకు మరియు సానిటేషన్ గురించి సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా సకాలంలో భువన్ సర్వే పూర్తి చేసి పట్టణంలోని అన్ని వ్యాపార వాణిజ్య సముదాయాలకు వృత్తి వ్యాపార లైసెన్సు జారీ చేయాలని, వనమహోత్సవంలో భాగంగా ఇచ్చిన టార్గెట్లను పూర్తి చేయాలని, మెప్మా మహిళా మరియు వీధి విక్రయ దారుల సంఘాలను ఏర్పాటు, బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళలను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఇట్టి సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వై. సుదర్శన్, అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్. రాజు, సానిటరి ఇన్స్పెక్టర్ సురిగి శంకర్ గౌడ్, మేనేజర్ రాకేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సక్కు నాయక్, మెప్మా టి.ఎం.సి. జగమంతు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కనబడుట లేదు



**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వేలంగి రావు దరకస్తూ మేరకు తన భార్య శ్రావణి (26) గత ఒక నెల నుండి వారిద్దరూ బోడుప్పల్లోని దేవేందర్ నగర్ కాలనీలో ఉన్న అతని భార్య సోదరి ఎ. సుమలత ఇంట్లో నివసిస్తున్నారు. ఈ నెల 28న సాయంత్రం 7.50 గంటలకు ఫిర్యాదుదారుడు తన రాత్రి డ్యూటీకి బయలుదేరాడు. తరువాత 10.30 గంటలకు భోజనం చేసిన తర్వాత అతని భార్య, ఆమె సోదరి 01.30 గంటలకు నిద్రకు వెళ్లారు. ఎ. సుమలత నిద్ర లేచినప్పుడు ఆమె ఇంట్లో తన సోదరి శ్రావణి కనబడుట లేదు. ఇట్టి విషయం పై మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనధి.


# పేద వాడి కలలను నిజం చేయడానికే ప్రజా ప్రభుత్వం

**జయభేరి, ఘట్కేసర్ :**



ఘట్కేసర్ మున్సిపల్ లో ఇందిరమ్మ పథకం కింద వచ్చిన 5 లక్షల రూపాయలు మంజూరు అయినా వారికి ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఘట్కేసర్ మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, అధ్యక్షులు ముత్యాలు యాదవ్. ఈ సందర్భంగా మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో 6వ వార్డులో రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని, పేద వాడి కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని అర్హులందరికీ ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని రానున్న రోజుల్లో రెండవ విడత కింద మల్లి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని పేదలకు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్ష రూపాయలు మంజూరు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం మహోత్సవం కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గంలోని ఘట్కేసర్ మున్సిపాలిటీ లో పలు వార్డులో పలువురు నాయకుల సహకారం తో భూమి పూజ చేసుకున్నాం అని తెలిపారు.

అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీవీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు, మొయినార్టీ అధ్యక్షులు ఫరూక్, నాయకులు సిరాజ్, సత్తి రెడ్డి, రెహమాన్, నర్సింగ్ రావు, గోదా గణేష్ యాదవ్, సాయి యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రేమను పంచడం గురించే ఆలోచిస్తా!

'యుద్ధంలోకి దిగామంటే అన్నింటికి సిద్ధంగా ఉండాలి. అందుకే నేనెప్పుడూ ఫిట్‌గా ఉంటూ నటుడిగా ఏ సవాలునైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉంటా. ప్రతీ సినిమాకు ప్రాణం పెట్టి పనిచేస్తా' అన్నారు అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన తాజా చిత్రం 'కింగ్డమ్' నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్ దేవరకొండ మాట్లాడారు. గతంతో పోలిస్తే ఇప్పుడు చాలా కూల్‌గా మాట్లాడుతున్నారనే ప్రశ్నకు విజయ్ దేవరకొండ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తాను ఎవరి కోసమో మారనని, మనసులో ఉన్నది ఉన్నట్లు మాట్లాడతానని చెప్పారు. సోషల్‌మీడియాలో కొందరు ఆయనపై చేసే వ్యతిరేక ప్రచారం గురించి స్పందించాలని కోరగా 'నేను కేవలం ప్రేమను పంచడం గురించే ఆలోచిస్తా. ద్వేషం మీద దృష్టిపెట్టేంత తీరిక లేదు' అన్నారు. 'కింగ్డమ్' సినిమాలో యాక్షన్ అన్నది కేవలం ఓ ఎలిమెంట్ మాత్రమేనని, కథ మొత్తం కట్టిపడేసే భావోద్వేగాలతో సాగుతుందని తెలిపారు. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు 'కింగ్డమ్' ప్రపంచంలో లీనమైపోతారని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'సినిమాకు అద్భుతమైన ఓపెనింగ్స్ వచ్చాయి. విజయంపై పూర్తి ధీమాతో ఉన్నాం. ఇది పూర్తిస్థాయి యాక్షన్ సినిమా కాదు. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తనశైలి ఎమోషన్స్‌తో రూపొందించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా. ఎక్కువగా రియల్ లోకేషన్స్‌లో షూట్ చేశాం' అన్నారు. ఈ సినిమాలో తాను మధు అనే పాత్రలో కనిపిస్తానని, ఎంతో ఛాలెంజింగ్ రోల్ అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే చెప్పింది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, ఆర్ట్: అవినాష్‌కొల్లా, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, దర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.

## కొట్టాడో ఖేల్‌ఖతమే..



సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ' ఆగస్ట్ 14న విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నాగార్జున, అమీర్‌ఖాన్ ముఖ్య పాత్రల్ని పోషిస్తుండటంతో పాన్ ఇండియా స్థాయిలో సినిమాపై భారీ హైప్ నెలకొని ఉంది.

ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి స్పందన వచ్చింది. తాజాగా 'పవర్‌హౌజ్' అంటూ సాగే మూడో గీతాన్ని విడుదల చేశారు. 'ఉగ్రూతలూగు సింగమే, కొట్టాడో ఖేల్ ఖతమే, ఈ కూలీ పవర్‌హౌజ్' అంటూ రజనీకాంత్ ఇమేజ్‌ను ఎలివేట్ చేస్తూ ఈ పాట సాగింది. అనిరుధ్ రవిచందర్ స్వరపరచిన ఈ గీతాన్ని రాంబాబు గోసాల రచించారు. ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాత: కళానిధి మారన్.

## టాలీవుడ్ బోల్డ్ హీరోయిన్..



సాధారణంగా సినిమా సెలబ్రిటీలంటే చాలా రిచ్ అని అనుకుంటారు చాలామంది. కోట్లలో ఆస్తులు, లగ్జరీ లైఫ్, విలాసవంతమైన భవనాలు, లెక్కలేనన్నీ కార్లు.. ఇలా లార్జర్ ద్యాన్ లైఫ్ అనుకుంటారు. కానీ వారి జీవితాల్లోనూ కన్నీళ్లు, కష్టాలు ఉంటాయి. సెలబ్రిటీ స్థాయికి చేరుకోవడానికి వారు ఎన్నో ఇబ్బందులు పడి ఉంటారు. ఇప్పుడు మనం మాట్లాడుకోబోయే హీరోయిన్ కూడా సరిగ్గా ఇదే కోవకు చెందుతుంది. ఈ నటి చిన్నగా ఉన్నప్పుడే తల్లి చనిపోయింది. తండ్రేమో మందుకు బానిసైపోయాడు. ఎవరూ తనను పట్టించుకోవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఓ అనాథాశ్రమంలో పెరిగింది. కంటి నిండా నిద్ర లేదు. కడుపు నిండా తిండి లేదు. ఎన్నో ఇబ్బందులు పడి ఎలాగోలా చదువు కుంది. ఒకానొక దశలో లంచ్ టైంలో పానీపూరి తిని కడుపు నింపుకొంది. దీంతో టీబీ తదితర సమస్యలు చుట్టు ముట్టాయి. జర్నలిజం పూర్తి చేసి ఒక ప్రముఖ దినపత్రికలో కూడా పనిచేసింది. కానీ నటనపై మక్కువతో సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. మెయిన్ స్ట్రీమ్ హీరోయిన్ కాకపోయినా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బోల్డ్ సినిమాలు, టీవీ షోస్ చేస్తూ తరచూ ట్రెండ్ అవుతోంది. ఇంతకీ ఆమె ఎవరనుకుంటున్నారా? తను మరెవరో కాదు తేజస్విని మదివాడ. మహేశ్ బాబు నటించిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది తేజస్వి. ఆ తర్వాత సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన ఐస్ క్రీమ్ సినిమాలో సోలో హీరోయిన్‌గా నటించింది. అయితే వీటి తర్వాత ఎక్కువగా సెకెండ్ లీడ్ రోల్స్ లోనే కనిపించింది తేజస్వి. అందులోనూ చాలా వరకు బోల్డ్ పాత్రలే పోషించింది. ఇక బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షోలోనూ సందడి చేసిందీ అందాల తార.

## చాక్లెట్ కంపెనీలో పని చేసింది..

తెలుగులో ప్రసారం అవుతున్న సీరియల్స్‌లో ఇల్లుఇల్లాలుపిల్లలు సీరియల్ ఒకటి. ఈ సీరియల్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఈ సీరియల్ ప్రభాకర్, ఆమనీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అలాగే ఈ సీరియల్ లో నర్మద పాత్రలో నటించిన నటి కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె పేరు అన్షు రెడ్డి. ఈ చిన్నది తన నటనతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. చక్కటి అభినయం కనబరుస్తూ ఫ్యామిలీ ఆడియన్స్ ను కట్టిపడేసింది. గడుసరి కోడలిగా సీరియల్ లో కనిపించిన ఈ చిన్నది మెప్పించింది. ఈ సీరియల్ కంటే ముందు చాలా సీరియల్స్ లో నటించి మెప్పించినది అన్షు రెడ్డి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్ లో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి మాట్లాడింది. నా అసలు పేరు అనూష, కానీ ఇంట్లో అన్షు అని పిలుస్తుంటారు. నేను కాలేజ్ లో ఉన్నప్పుడు స్టార్ మహిళ గేమ్ షో పాల్గొన్నా.. ఆ షోలో చూసి నన్ను ఆడిషన్‌కి పిలిచారు అని తెలిపింది. నేను కాలేజ్ లో ఉన్నప్పుడు 15 గేమ్ షోల్లో పాల్గొన్నా.. అదేవిధంగా శ్రావణ సమీరాలు సీరియల్ లో ఛాన్స్ వచ్చింది. మాది వరంగల్ మేము హైదరాబద్ లో సెటిల్ అయ్యాం.. హైదరాబాద్ వచ్చినప్పుడు ఫైనాన్షియల్ గా చాలా ఇబ్బందిపడ్డం.. ఓ చాక్లెట్ కంపెనీలో వర్క్ చేశా.. 12గంటలు కష్టపడితే డైలీ రూ. 70 ఇచ్చేవారు. అలాగే రూ. 3 రూపాయిల బస్ టికెట్ సేవ్ అవుతుందని ఆరు మైళ్లు నడిచేదాన్ని.. ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత నేను ఎక్కడికి వెళ్లినా.. మా అమ్మ నాతో వచ్చేది. నేను యాక్టర్ అవుతానని అనుకోలేదు యాక్టర్ అవుతానని అనుకోలేదు. అనుకోకుండా అయ్యాను అంటూ చెప్పుకొచ్చింది.



## ఇదెక్కడి సినిమా రా సామీ..! మూడు రోజుల్లోనే రూ. 2500కోట్లు..



థియేటర్స్ కొత్త సినిమాలు విడుదలై సందడి చేస్తున్నాయి. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల హవా నడుస్తుంటడంతో.. చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా సినిమాల్ని వరుసగా పాన్ ఇండియా రేంజ్ లో విడుదలవుతున్నాయి. కేవలం తెలుగు సినిమాలే కాదు ఇతర భాషల సినిమాలు కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఓ సినిమా నయా రికార్డ్ క్రియేట్ చేసింది. విడుదలైన మూడు రోజుల్లోనే రూ. 2500 కోట్లు వసూల్ చేసి బాక్సాఫిస్ ను షేక్ చేసింది. ఇండస్ట్రీలోనే పెద్ద హిట్ గా నిలిచింది ఈ సినిమా.. విడుదలైన దగ్గర నుంచి ఈ సినిమాకు ప్రేక్షకులు క్యూ కడుతున్నారు. ఎక్కడ చూసిన హౌస్ ఫుల్ బోర్డులతో థియేటర్స్ నిండిపోయాయి. ఇంతకూ ఈ సినిమా ఏదో తెలుసా.? ఆ సినిమా ఏదంటే..

టాలీవుడ్ లో హాలీవుడ్ సినిమాలకు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా సూపర్ హీరోల సినిమాలు గతంలో ఎన్నో హాలీవుడ్ సినిమాలు తెలుగలో డబ్ అయ్యి భారీ కలెక్షన్లు రాబట్టాయి. ఇక తెలుగులో మార్కెట్ ను పెంచుకునేందుకు, ఇక్కడి ఆడియెన్స్ కు మరింత చేరువ అయ్యేందుకు సినిమాలను గ్రాండ్ గా విడుదల చేస్తున్నారు. ఇక ఇప్పుడు థియేటర్స్ లో దుమ్మురేపుతున్న సినిమా ఏదో కాదు ఫెంటాస్టిక్ ఫోర్. ఈ సైన్స్ ఫిక్షన్ సినిమా రీసెంట్ గా విడుదలై సంచలన విజయాన్ని అందుకుంది.

ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసింది. దీన్ని రూ.2300 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. విడుదలైన మూడు రోజుల్లోనే ఈ సినిమా నయా రికార్డ్ క్రియేట్ చేసింది. మార్వెల్ కామిక్స్ ఫ్రాంచేజ్ లో వచ్చిన ఈ సినిమాలన్ని మంచి కలెక్షన్స్ సొంతం చేసుకున్నాయి. ఇక ఈ సినిమా రూ. 2500కోట్లు వసూల్ చేసింది. కేవలం మూడు రోజుల్లోనే ఈ సినిమా భారీ కలెక్షన్ సొంతం చేసుకుంది. రానున్న రోజుల్లో మరిన్ని కోట్లు కొల్లగొట్టనుంది ఈ సినిమా..

Printed and Published, Editor & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com